TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 63 | 01 ఆదివారం నవంబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

తేని జైలు ఘటనపై సీఎం విజయ్ సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు

● **తేని జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారైన ఘటన**



తమిళనాడులోని తేని జిల్లా జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ...మిగతా 2 లో...

ఇస్రో ప్రయోగం సక్సెస్..

శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

- **జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-03 ఉపగ్రహం విజయవంతం**
- **ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రధాని మోదీ అభినందనలు**
- **స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్' బలోపేతం అవుతుందని వెల్లడి**





భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్ర ఒక పోస్ట్ చేశారు. "జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయ వంతంగా ప్రవస్థ 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన ముందడుగు" అనితో కూడిన ఈ ఉప గ్రహం, కీలక సాంకేరు. ప్రజలకు మెరు గైన నావిగేషన్ సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మన అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, నైపు ణ్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తు న్నాయని మోదీ కొనియాడారు.

...మిగతా 2 లో...



ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?:

ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్

- **బ్యాంకు ఆస్తుల విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ**
- **రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వస్తే నిబంధనలు మార్చడంపై ప్రశ్నలు**

ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువనుతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని నిలదీశారు. "ప్రతిష్టాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?" అని ఆయన అన్నారు.



TGTEL/26/A5513
వార్త దీపిక

మూడేళ్లు గడుస్తున్నా ఆ పనులు ముందుకు కదలడంలేదు: కొడంగల్‌లో డీకే అరుణ

మొదటిపేజీ తరువాయి

పాల మూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథ కంతో పాటు నెట్టెంపాడు, కల్వకుర్తి, గట్టు లిఫ్ట్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డీకే అరుణ డిమాండ్ చేశారు. ఆర్డీఎస్ సమస్యను పరిష్క రించి రైతులకు సాగునీరు అందిం చడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శి ంచారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ భూములను విక్రయి ంచడమేంటని ఆమె మండిపడ్డారు. కొడంగల్‌లో రోడ్డు విస్తరణ పనుల కోసం ఇళ్లు కోల్పోతున్న బాధితులకు ముందుగా నష్టపరిహారం చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పరిహారం ఇవ్వకుండా వారిని ఎలా ఖాళీ చేయిస్తారని ముఖ్యమంత్రిని ఆమె నేరుగా ప్రశ్నించారు. కొడంగల్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరైన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై తక్షణమే దృష్టి సారించాలని సూచించారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం

మొదటిపేజీ తరువాయి

సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు.రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు, బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఆసుపత్రి గదిలో అమ్మ కోసం మధురమైన వేణుగానం.. మనసులు గెలుస్తున్న కేంద్ర మాజీ మంత్రి

అనారోగ్యంతో ఆసుపత్రిలో అర్జున్ ముండా తల్లి

తల్లి పక్కన కూర్చొని పిల్లనగ్రోవి వాయించిన కేంద్ర మాజీ మంత్రి

సంగీతం వింటూ చిరునవ్వు చిందించిన తల్లి

వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్న అర్జున్ ముండా

అమ్మను జీవితంలో విలువైన ఆశీర్వాదంగా అభివర్ణన

రాజకీయాల్లో కీలక పదవులు చేపట్టిన వ్యక్తి.. వందలాది మంది ముందు ప్రసంగించిన నాయకుడు.. కానీ అమ్మ దగ్గరకు వచ్చేసరికి ఆయన ఓ సాధారణ కొడుకే! అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లి పక్కన కూర్చొని పిల్లనగ్రోవితో మధురమైన స్వరాలు పలికించారు కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా. ఆ సంగీతం వింటూ తల్లి ముఖంలో చిరునవ్వు విరబూసింది. ఈ చిన్న దృశ్యం ఇప్పుడు నెటిజన్ల మనసులను హత్తుకుంటోంది.ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా తన తల్లితో గడిపిన ఈ అపురూప క్షణాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సమయంలో ఆమెకు ధైర్యం చెప్పేందుకు, కాస్త ఆనందాన్ని పంచేందుకు అర్జున్ ముండా ఆమె పక్కనే కూర్చున్నారు. అనంతరం పిల్లనగ్రోవి తీసుకుని మెల్లగా స్వరాలు పలికించారు. ఆ మధురమైన సంగీతం వింటూ తల్లి ముఖంలో చిరునవ్వు కనిపించింది. తల్లి పక్కన కొడుకు.. ఆ కొడుకు చేతిలో పిల్లనగ్రోవి.. ఆసుపత్రి గదిలో ప్రతిధ్వనించిన ఆ స్వరాలు.. ఈ దృశ్యం చూపరులను కదిలిస్తోంది.ఈ వీడియోతో పాటు అర్జున్ ముండా తన తల్లి గురించి భావోద్వేగ సందేశం రాశారు. “అమ్మ నా జీవితంలో అత్యంత విలువైన ఆశీర్వాదం. ఆమె ప్రేమే నా గొప్ప బలం. ఆమె ఆశీస్సులే నాకు అండ. ఆమె జీవితం నాకు అతిపెద్ద ప్రేరణ” అని పేర్కొన్నారు.సాధారణంగా అర్జున్ ముండాను రాజకీయ నాయకుడిగా, మాజీ ముఖ్యమంత్రిగా చూస్తుంటాం. కానీ ఈ వీడియోలో మాత్రం ఆయనలోని ఓ ప్రేమగల కొడుకు కనిపిస్తున్నారు. జీవితంలో ఎంతటి ఉన్నత స్థానానికి చేరుకున్నా అమ్మ దగ్గర మనిషి చిన్నపిల్లాడే. ఒకప్పుడు మన కోసం ఎన్నో త్యాగాలు చేసిన అమ్మకు.. ఆమెకు అవసరమైనప్పుడు మనం పక్కన ఉండటమే పెద్ద ఓదార్పు. మాటలతో చెప్పలేని ప్రేమను కొన్నిసార్లు ఓ చిన్న స్పర్శ, ఓ చిరునవ్వు, ఓ మధురమైన పాట చెప్పేస్తాయి. అర్జున్ ముండా పిల్లనగ్రోవి స్వరాలు కూడా అదే భావాన్ని పలికించాయి. ఈ వీడియో సోషల్ మీడియాలో పలువురిని కదిలిస్తోంది.



ఇస్రో ప్రయోగం సక్సెస్..

మొదటిపేజీ తరువాయి

‘నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టలేషన్’ (నావిక్) అనేది భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలోనే ఇది పనిచేస్తుంది. దేశ భద్రత, రవాణా, విపత్తుల నిర్వహణ, పౌర సేవలు వంటి అనేక రంగాల్లో కచ్చితమైన పొజిషనింగ్, టైమింగ్ సేవలను అందించడం దీని లక్ష్యం. ప్రస్తుతం ప్రయోగించిన ఎన్‌వీఎస్-03, నావిక్ కోసం రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఒకటి. ఇది నావిక్ వ్యవస్థకు మరింత శక్తిని అందించి, దాని సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అటామిక్ క్లాక్ ఉండటం విశేషం. ఈ విజయంతో అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

తేని జైలు ఘటనపై సీఎం విజయ్ సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు

మొదటిపేజీ తరువాయి

ఈ ఘటనలో బాధ్యులను చేస్తూ తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను సస్పెండ్ చేయగా, మరో సీనియర్ అధికారిని బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, నిఘాను పటిష్ఠం చేయాలని ముఖ్యమంత్రి విజయ్ ఉన్నతాధికారులను ఆదేశించారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను అక్టోబర్ 30 నుంచి తదుపరి ఆదేశాలు జారీ చేసేంతవరకు సస్పెండ్ చేశారు. అదేవిధంగా మధురై సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న ఆర్. కృష్ణరాజ్‌ను సేలం సెంట్రల్ జైలుకు బదిలీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం విజయ్ హెచ్చరించారు.అక్టోబర్ 26న తేని జిల్లాలోని టెక్కంపట్టి సబ్-జైలులో ఈ ఘటన జరిగింది. వైద్యపరమైన అత్యవసర పరిస్థితిని సృష్టించిన ఖైదీలు, జైలు గార్డులపై దాడి చేసి, వారి నుంచి తాళాలు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు, ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పరారైన 17 మందినీ తిరిగి పట్టుకున్నారు.ఈ జైలు బ్రేక్ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల భద్రతపై ప్రభుత్వం సమీక్ష ప్రారంభించింది. ఇప్పటికే ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై 9 మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

కాంగ్రెస్ హయాంలో పటేల్‌కు దక్కాల్సిన గౌరవం దక్కలేదు.. అమిత్ షా తీవ్ర ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సర్దార్ పటేల్ స్మారకంగా ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహమైన ‘స్టాచ్యూ ఆఫ్ యూనిటీ’ని నిర్మించారని షా గుర్తుచేశారు. ఈ స్మారక నిర్మాణం ద్వారా పటేల్ సేవలు, ఆయన వ్యక్తిత్వాన్ని దేశవ్యాప్తంగా ప్రజలకు పరిచయం చేశారని పేర్కొన్నారు.దేశ సమైక్యతకు పటేల్ చేసిన కృషిని అమిత్ షా ప్రస్తావించారు. కేవలం 1,218 రోజుల్లోనే ఆయన అవిభాజ్య భారతదేశ నిర్మాణానికి పునాది వేశారని అన్నారు. పలువురు నాయకులు కలిసి జీవితకాలంలో సాధించలేని పనులను పటేల్ తక్కువ సమయంలోనే పూర్తి చేశారని వ్యాఖ్యానించారు.దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చేందుకు ప్రజలంతా సహకరించాలని షా పిలుపునిచ్చారు. 2029 డిసెంబర్ 31 నాటికి భారత్‌ను పూర్తిగా డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ‘నషా ముక్త్ భారత్’ సాధనతోనే ‘వికసిత్ భారత్’ లక్ష్యం దిశగా ముందడుగు వేయగలమని అన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి నక్సలిజం నిర్మూలన దిశగా దేశం పురోగతి సాధించిందని పేర్కొన్నారు.మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పటేల్ జయంతిని జాతీయ ఐక్యతా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు షా చెప్పారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయిలో భారత్‌లో విలీనమైందని, నక్సలిజం నిర్మూలనకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు.

మధ్యంతర ఎన్నికల్లో పరాభవం ఎదురైతే ఇరాన్‌కు మూడినట్లేనా? ట్రంప్ ప్లాన్స్ ఏంటి?

మొదటిపేజీ తరువాయి

శనివారం దోహాలోనూ చర్చలు కొనసాగనున్నాయి. అణు కార్యక్రమంపై రాయితీలు ఇవ్వాలని అమెరికా కోరుతుండగా.. ముందుగా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, నిలిపివేసిన నిధులను విడుదల చేయాలని, చమురు విక్రయాలకు అనుమతించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లోనే ఇరాన్‌పై కొత్త సైనిక చర్యలు ప్రారంభించేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నాయని ఇటీవల సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. ఇరాన్‌లోని ఇంధన వనరులు, సైనిక స్థావరాలు, అణు కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిగే అవకాశం ఉందని అమెరికా అధికారులను ఉటంకించింది. అయితే తుది నిర్ణయం ట్రంప్ తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే దాడులకు సంబంధించి ట్రంప్ నుంచి ఇప్పటివరకు తుది ఆదేశాలు వెలువడలేదు.



జాతీయ ఐక్యతా దినోత్సవం

వార్త దీపిక న్యూస్

ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా కమాన్‌పూర్‌లోని కంఫర్ట్ గ్రామర్ స్కూల్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రిన్సిపాల్ వినయ్ కుమార్, సౌమ్య మేడం ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వినయ్ కుమార్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం అనంతరం 562 సంస్థానాలను ఏకం చేసి సమగ్ర భారతావనిని నిర్మించిన ఘనత సర్దార్ పటేల్‌దేనని అన్నారు. ఆయన స్ఫూర్తితో విద్యార్థులు ఐక్యతతో మెలగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించారు. ‘ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్’ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమార్,చంద్రలేఖ, స్వప్న, శిల్ప మౌనిక,షాహనాజ్,రవళి, విజయలక్ష్మి, తహమీన్, లక్ష్మి, జ్యోత్స్న, మౌనిక,సంధ్య, మేఘన పాల్గొన్నారు.



సాగు భూమి సంరక్షణ అందరి బాధ్యత.

వార్త దీపిక న్యూస్ :

సాగుభూమి సంరక్షణ అందరి బాధ్యత అని ఉద్యానవన శాస్త్రవేత్త భాస్కర్, కమాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి గిరి రామకృష్ణ అన్నారు. కమాన్ పూర్ మండలం, సిద్దిపల్లి గ్రామంలో పంచాయతీ ఆవరణలో కేత్ బచావో అభియాన్ (సాగు భూమి సంరక్షణ కార్యక్రమం) నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి, గిరి. రామకృష్ణ సార్ , అదేవిధంగా డా. బి. భాస్కర్ రావు, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజజ్ఞాన కేంద్రము రామగిరిఖిల్లా మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వలన రానున్న సీజన్లో తక్కువ నీటితో సాగు చేయగలిగిన పంటల రకాలు, యాజమాన్య పద్ధతులను, పంట మార్పిడి గురించి వివరించారు. అధిక ఆదాయాన్నిచ్చే పంటలైన కూరగాయలు మరియు ఆయిల్ పంటను సాగు చేసుకోవాల్సిందిగా సూచించారు. కూరగాయలలో బెండ, అలసంద, గోరుచిక్కుడు లాంటి పంటలు మరియు అదనపు ఆదాయాన్నిచ్చే బీర, సొర లాంటి పంటలను సాగు చేయాలని సూచించారు. బిందు సేద్య పద్ధతి, మల్చింగ్ చేయడం వలన నీరు ఆదా అవటంతో పాటు కలుపు నివారణ జరుగుతుందని తెలిపారు. ఆయిల్ఫామ్ పంట ఒకసారి నాటితే 40 సంవత్సరాల వరకు ప్రతి నెలకు ఆదాయం వస్తుందని, వరి మరియు పత్తి పంటలతో పోలిస్తే 2-3 రెట్లు ఎక్కువ ఆదాయం వస్తుందని మరియు దానిలో అంతర పంటలు సాగు చేసుకోవడం కూడా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధపల్లి గ్రామ సర్పంచ్ బంగారి కళ్యాణి మహేష్ , ఉప సర్పంచ్ కొత్తపల్లి సతీష్ , ఏఈఓ నవీన్, రైతులు, పాల్గొన్నారు.



నేత్రదానంపై అపోహలు వీడాలి


- మరణానంతరం ఇద్దరికి చూపునివ్వడం గొప్ప సేవ

- - సదాశయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

- కొనియాడిన లయన్ కోలేటి మారుతీ

వార్త దీపిక న్యూస్ : .

నేత్రదానంపై ఉన్న అపోహలను వీడి ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్ లింగమూర్తి పిలుపునిచ్చారు. మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరికి చూపునిచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఉమ్మడి కమాన్‌పూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ వైనాల రాజు తండ్రి సాంబయ్య ఇటీవల మృతి చెందారు. తీవ్ర విషాదంలోనూ కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపునిచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం సాంబయ్య సంస్మరణ సభ కమన్పూర్ లయన్స్ క్లబ్ మరియు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు విషాద సమయంలోనూ మానవతా దృక్పథంతో నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులను అభినందించారు. నేత్ర, అవయవ, దేహదానాలు మహోదానాలని, వీటిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. గత 18 ఏళ్లుగా సదాశయ ఫౌండేషన్ నేత్రదానంపై చేస్తున్న కృషిద్వారా 1693 మానవతా మూర్తులునేత్ర దానాలు చేసారని తెలిపారు నేత్రదాత కుటుంబ సభ్యులకు ముఖ్య అతిధి ణమీ ప్రవీణ్ రెడ్డి మరియు లయన్స్ క్లబ్ కోలేటి మారుతీ, చేతుల మీదుగా అభినందన పత్రాన్ని అందజేసారు వచ్చిన బందు మిత్రులకు లింగమూర్తి నేత్ర అవయవ దేహ దానాలపై అవగాహనా కల్పించారు ఈ కార్యక్రమంలో నేత్ర దానం చేసిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీ ఏ సీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, మాజీ ఎంపీపీ మల్యాల రాంచంద్రం గౌడ్లతో పాటు తదితరులు ఉన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

చిన్నారికి ఎమ్మెల్సీ అభినందనలు

పట్టుదల ఉంటే విజయం తథ్యం

ఎమ్మెల్సీ అంజిరెడ్డి

పటాన్ చెరు, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :

ప్రస్తుత కాలంలో విద్యతో పాటు క్రీడలలో రాణించడం ఎంతో కీలకమని, ముఖ్యంగా యోగా సాధన ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తాయని ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి అన్నారు. ?సంగారెడ్డి పట్టణంకు చెందిన చిన్నారి వాసవి నిద్రాభంగి జాతీయ స్థాయిలో అసాధారణ ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటారు. రాజస్థాన్‌లోని చారిత్రాత్మక జైపూర్ నగరంలో గల అలంకార్ మహిళా పీజీ మహావిద్యాలయంలో అక్టోబర్ 3 నుండి 6వ తేదీ వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 51వ సబ్-జూనియర్ ఉ జూనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026 పోటీల్లో ఆమె పాల్గొని అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ?యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ స్థాయి క్రీడా సంబరాలలో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన వాసవి నిద్రాభంగి, సబ్-జూనియర్ గ్రూప్-ూ (8-10 సంవత్సరాల బాలికల విభాగం) యోగాసన పోటీల్లో అత్యంత క్లిష్టమైన ఆసనాలను అవలీలగా ప్రదర్శించి జాతీయ స్థాయిలో ఐదవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పలు రాష్ట్రాల నుండి వచ్చిన ఉద్ధండులైన క్రీడాకారులతో పోటీపడి, చిన్న వయసులోనే పతకం సాధించడం పట్ల సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మేరకు చిన్నారిని ఎమ్మెల్సీ నివాసంలో వారు కలిశారు. ఈ మేరకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంలో తల్లిదండ్రుల పాత్ర అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి

జిల్లా పోలీసు ఆధ్వర్యంలో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :

స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యత దినోత్సవం (రాష్ట్రీయ ఏక్తా దివస్) పురస్కరించుకొని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగా, భారతదేశ తొలి ఉప ప్రధానమంత్రిగా, తొలి హోంమంత్రిగా దేశానికి విశేష సేవలందించారని తెలిపారు. స్వాతంత్ర్యం అనంతరం దేశంలో ఉన్న 565 సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేసి, దేశ ఐక్యతకు పునాదులు వేశారని పేర్కొన్నారు. ఆయన దృఢమైన నాయకత్వం, పట్టుదలతో దేశాన్ని ఐక్యంగా నిలపడంలో కీలక పాత్ర పోషించారని, అందుకే ఆయనను 'భారత ఉక్కు మనిషి', 'భారత బిస్మార్క్' అని గౌరవంగా స్మరించుకుంటామని అన్నారు. 1928లో గుజరాత్‌లోని బార్డోలీలో రైతులపై విధించిన అధిక పన్నులకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ ఉద్యమానికి వల్లభాయ్ పటేల్ నాయకత్వం వహించి, రైతులను ఏకం చేసి అహింసా మార్గంలో ఉద్యమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. ఆయన నాయకత్వ లక్షణాలను మెచ్చిన మహాత్మా గాంధీ ఆయనకు 'సర్దార్' అనే బిరుదును ప్రదానం చేశారని పేర్కొన్నారు.సర్దార్ వల్లభాయ్ పటేల్ తెలంగాణతో కూడా ప్రత్యేక అనుబంధం ఉందని ఎస్పీ తెలిపారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, అప్పటి హైదరాబాద్ సంస్థానం నిజాం పాలనలో కొనసాగిందని, సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢమైన నిర్ణయాలు, చర్యల ఫలితంగా 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైందని గుర్తుచేశారు.వందలాది సంస్థానాలను ఏకం చేసి ఐక్య భారతదేశ నిర్మాణానికి కృషి చేసిన మహనీయుడికి ఘన నివాళులర్పిస్తూ, జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడటం, సమాజంలో శాంతి సామరస్యాలను పెంపొందించడం, మాతృభూమి సేవకు అంకితభావంతో పనిచేయడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి, సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్ రావు, నిరంజన్ రెడ్డి, ఆర్ఐలు సురేష్ నాయక్, రాజశేఖర్, డానియోల్, శ్రీనివాస్ రావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవో పట్టణ అధ్యక్షుడు యాదవ రెడ్డికి ఘన సన్మానం

సంగారెడ్డి, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :

టీఎన్ జీఓ సంగారెడ్డి పట్టణ అధ్యక్షునిగా ఎన్నికైన యాదవ రెడ్డిని టి యూడబ్ల్యూ జెఐజెయూ సంగారెడ్డి జిల్లా నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. డిపిఆర్ఓ కార్యాలయం లో యాదవ రెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. సంగారెడ్డి పట్టణ టిఎన్జీవో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే పైసల్, జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులు శనివారం యాదవ రెడ్డిని శాలువాతో సత్కరించారు. పూలమాలలు వేసి అభినందించారు. యాదవ రెడ్డి జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలపై నిత్యం సహకరిస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. టీఎన్జీవోల కోసం సేవా దృక్పథంతో పనిచేయాలని జర్నలిస్టు సంఘం నేతలు పేర్కొన్నారు. ముమ్మందు మరిన్ని ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. సదాశివపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు హోజీ, చిన్న మధ్య తరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్,సంఘ నాయకులు మతీన్ , మసూద్, రఫిక్ నూరి, సత్తార్,రఫీ ముజాహిద్ , సత్యనారాయణ రెడ్డి, సిద్ధూ ,శ్రీనివాస్‌మహబూబ్ గౌరీ శంషుద్దిన్ నాథిఖ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజం

పదవీ విరమణ పొందిన ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ కు ఘన సన్మానం

వీడ్కోలు పలికిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్



సంగారెడ్డి, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :

పదవీ విరమణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి పదవీ విరమణ పొందుతున్న టి.నాగేశ్వర్ రావు, ఎస్ఐ, మహ్మద్ అబ్దుల్ బారీ, హెడ్ కానిస్టేబుల్, వి.సుధర్శన్, హెడ్ కానిస్టేబుల్‌లను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఉద్యోగ జీవితంలో పదవీ విరమణ సహజమని, సర్వీస్ కాలమంతా ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందడం గొప్ప విషయమని అన్నారు. ఒక ఉద్యోగి విజయవంతంగా తన విధులను నిర్వర్తించడంలో ఉద్యోగి కృషితో పాటు వారి కుటుంబ సభ్యుల సహకారం, ప్రోత్సాహం కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. 1985 సంవత్సరంలో సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో నియమితులై, ఉమ్మడి మెదక్ జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలతో పాటు వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించి రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా పతకాలను అందుకున్నారు. తన సర్వీస్ కాలంలో ఎలాంటి ప్రతికూల రిమార్కులు లేకుండా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని ఎస్పీ పేర్కొన్నారు. 1987 సంవత్సరంలో సివిల్ పోలీస్ కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో నియమితులై, ఉమ్మడి మెదక్ జిల్లాలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలతో పాటు వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం విశిష్ట సేవలందించి రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా పతకాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి పద్మావతి, ఏఆర్ డీఎస్పీ నరేందర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, ఆర్ఐలు సురేష్, రాజశేఖర్ రెడ్డి, డానియెల్, పదవీ విరమణ పొందుతున్న అధికారుల కుటుంబ సభ్యులు, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు జనార్ధన్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కార్మికుడికి చైర్పర్సన్ చేయూత..!

తాండూర్, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :

అనారోగ్యంతో బాధపడుతున్న పారిశుద్ధ కార్మికుడికి మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నీరజబాల్ రెడ్డి చేయూతను అందించారు. పాత తాండూర్ 15వ వార్డులో పారిశుద్ధ కార్మికుడిగా పనిచేస్తున్న జె నవీన్ కుమార్ కొన్ని రోజులుగా శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం ఆయనను పట్టణంలోని జేపీ ఆసుపత్రికి తరలించి, అత్యవసర వైద్య సహాయం అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాదుకు తరలించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విషయం తెలుసుకున్న చైర్పర్సన్ నీరజబాల్ రెడ్డి కౌన్సిలర్ దివిటీ ఎల్లప్ప స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు.అదేవిధంగా ఎట్టి పరిస్థితుల్లో మనోధైర్యం కోల్పోవద్దని అండగా ఉంటామని భరోసాను అందించారు. పారిశుద్ధ్య కార్మికుడి పట్ల చైర్పర్సన్ కౌన్సిలర్ మానవత్వం చాటుకోవడంతో కుటుంబీకులు అభినందనలు తెలిపారు.



పదవీ విరమణ అనేది తప్పని సరి

32 ఏళ్లు సహకార శాఖలో విశిష్ట సేవలు

అంజనేయులు పదవీ విరమణ కార్యక్రమం

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :



సహకార శాఖలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ గత 32 సంవత్సరాలుగా విశిష్ట సేవలందించిన ఎ. అంజనేయులు పదవీ విరమణ కార్యక్రమం శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన అంజనేయులును శాలువాతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగిగా 32 సంవత్సరాల పాటు అంకితభావంతో విధులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉద్యోగ జీవితంలో ఎన్నో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు, శాఖకు సేవలందించిన ఆంజనేయులు సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, వ్యక్తిగత జీవితంలో కొత్త అధ్యాయానికి నాందని అన్నారు. భవిష్యత్తులో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. 32 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ ప్రస్థానంలో సహచర ఉద్యోగులతో ఏర్పరచుకున్న అనుబంధాలు, అందించిన సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు జావిద్ అలీ, జిల్లా కార్యదర్శి రవి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, సహకార శాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

బాలికల భద్రతపై అవగాహన

సివిల్ జడ్జి ఏ ప్రణయ

తాండూర్, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :

తాండూర్ జూనియర్ అదనపు సివిల్ జడ్జ్ ఏ ప్రణయ కూకట్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడారు. మైనర్ బాలికల భద్రత రక్షణకు సంబంధించిన అంశాలను వివరిస్తూ ఫోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.బాలికలు తమకు ఎదురయ్యే వేధింపులు, అసౌకర్యమైన పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి భయం లేకుండా తల్లిదండ్రులు గాని ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. బాలల హక్కుల రక్షణ కోసం చట్టాలు కల్పిస్తున్న అవకాశాలను వివరించారు.అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ సరస్వతి మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తత ఆత్మరక్షణ ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సరస్వతి, కృష్ణవేణి వైస్ ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.





ప్రజలకు కార్పొరేట్ వైద్యం..!

ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్ ప్రారంభం

ప్రారంభించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

ప్రజలకు నాణ్యమైన వైద్యమే లక్ష్యం..!

ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్ చైర్మన్ వెంకట్ అలపాటి



పటాన్‌చెరు, అక్టోబర్ 31, వార్త దీపిక న్యూస్ :

పటాన్‌చెరు ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలతో కూడిన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్‌ను మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఆసుపత్రి చైర్మన్ వెంకట్ అలపాటి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎంపీ రఘునందన్ రావు ఆసుపత్రిలోని ఐసీయూ, ఎమర్జెన్సీ వార్డులు, ఆపరేషన్ థియేటర్లను పరిశీలించారు. రోగులకు అందించనున్న వైద్య సేవలు, ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆధునిక సదుపాయాల గురించి చైర్మన్ వెంకట్ అలపాటిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ పటాన్‌చెరు ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావడం సంతోషక రమన్నారు. స్థానికంగానే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉండటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంటుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి యాజమాన్యానికి సూచించారు.



ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే మా లక్ష్యం: వెంకట్ అలపాటి

ఆసుపత్రి చైర్మన్ వెంకట్ అలపాటి మాట్లాడుతూ పటాన్‌చెరు ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సదుపాయాలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో ప్రాచీన్ గ్లోబల్ హాస్పిటల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక వైద్య పరికరాలతో నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో మెరుగైన వైద్యం అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆసుపత్రి ప్రారంభోత్సవానికి హాజరై ప్రోత్సహించిన ఎంపీ రఘునందన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, దాస్ యాదవ్, ఆసుపత్రి డైరెక్టర్లు, బీజేపీ అమీన్ పూర్ డివిజన్ అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్, వైద్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నేషనల్ ఎస్ జి ఎఫ్ సెలక్షన్స్

కి జే ఎస్ కే ఎస్ విద్యార్థులు

వార్త దీపిక న్యూస్ :

జగిత్యాల లో 29వ తేదీ నుండి 31వ తేదీ వరకు స్వామి వివేకానంద ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 70వ ఎస్ జి ఎఫ్ స్టేట్ సెలక్షన్స్ లో పెద్దపెల్లి జిల్లా రామగుండానికి చెందిన విద్యార్థిని విద్యార్థులు అండర్ 14 విభాగంలో బంగారు , వెండి పతకాలు సాధించారు. U/14 విభాగంలో -25 , ఎం కార్తికేయన్,-34 హేమలత మాజీ,-42 బి సహస్ర బంగారు పతకాలు సాధించి డిసెంబర్ పంజాబ్ లోని లుధియానాలో జరగబోయే నేషనల్ ఎస్.జి.ఎఫ్ కరాటే టోర్నమెంట్ కి ఎంపిక అయ్యారు. అలాగే -46 బి ఆశ్రిత వెండి పతకం సాధించింది. ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను మరియు కోచ్ కరాటే శ్రీనివాస్ ను జపాన్ షిటోరియో కరాటే స్కూల్ ప్రెసిడెంట్ ఎం రమేష్, కొమురోజు శ్రీనివాస్ పేట స్టేట్ ఉపాధ్యక్షులు, శోభారాణి పేట స్టేట్ ఉపాధ్యక్షురాలు, డాక్టర్ మల్లేశం ఫిజికల్ డైరెక్టర్ , సీనియర్ ఇన్స్ట్రక్టర్స్ ఎస్ శ్రీనివాస్, శ్రావణ్ కుమార్ పటేల్, బి పరమేష్ ,నిదిష్ కుమార్, రోహిత్ కుమార్, సంజన, శుభశ్రీ, ఎం ముక్తిశ్రీ, స్నేహ సుల్తానా, హేమలత మహా జీ ,అభిజ్ఞ, ఏ శ్రవణ్ కుమార్ స్పందన క్లబ్ సెక్రటరీ డాక్టర్ కె నరేంద్ర సోనీ ,స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ శ్రీరామ్ మరియు చిరంజీవి ఆదిత్య, వంశీకృష్ణ, గణేష్ రాజ్ మరియు తల్లిదండ్రులు అభినందించారు.



కలెక్టరేట్ లో రాష్ట్రీయ ఏక్తా దివస్

వార్త దీపిక న్యూస్ : :

రాష్ట్రీయ ఏక్తా దివస్ ను పురస్కరించుకుని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ప్రతిజ్ఞ చేశారు. నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, అదనపూ జిల్లా రెవెన్యూ అధికారిణి గీత ప్రతిజ్ఞ చేయించారు. దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకిత భావంతో కృషి చేస్తానని, తోటి వారందరిలో ఈ భావనను పెంపొందిం చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని, సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతతో దేశానికి సమకూరిన అంతర్గత భద్రతను పటిష్టపరిచేందుకు తోడ్పాటును అందిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో

నీటి పొదుపును పాటించాలి

' దిశా' సమావేశంలో ఎం.పీ ధర్మపురి అర్వింద్

ఆర్ఓబీల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించాలని ఆదేశం

అందుబాటులో ఉన్న నీటి వనరులను తాగునీటి అవసరాలకే వినియోగిస్తాం: కలెక్టర్ వెల్లడి

వార్త దీపిక న్యూస్ : :

ఎల్ నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరు నీటి పొదుపును పాటించాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్ సూచించారు. ప్రజలకు ఉపయుక్తంగా నిలిచే మాధవనగర్, అర్సపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయించాలని, రానున్న నాలుగైదు నెలల్లో వీటిని అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శనివారం ఎంపీ అర్వింద్ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, నగర మేయర్ కే.ఉమారాణి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిపై సమావేశంలో చర్చించారు. అంతకుముందు గత సమావేశంలో చేసిన తీర్మానాలపై చేపట్టిన చర్యల గురించి అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఎంతో జాగ్రత్తగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయమై ప్రజల్లో, రైతులలో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. కాగా, మాధవనగర్, అర్సపల్లి ఆర్.ఓ.బీల నిర్మాణాలలో ఎనలేని తాత్సారం జరుగుతోందని ఎం.పీ సంబంధిత అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. మైల్ స్టోన్ ప్రకారం నిర్విరామంగా పనులు జరిపిస్తూ నాలుగైదు నెలలలో పూర్తి చేయించాలని, మరోమారు గడువు పొడిగింపుకు ఉండకూడదని ఆర్ అండ్ బీ, రైల్వే అధికారులకు సూచించారు. నిజామాబాద్ నగరంలో భూగర్భ డ్రైనేజీ పనులను కూడా వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న తాగునీటి సరఫరా మెరుగుదల పనులను, ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రం నుండి కేటాయించబడిన నిధులను సక్రమంగా వినియోగిస్తూ, నిర్దేశిత గడువులోగా ప్రజోపయోగ పనులు పూర్తయ్యేలా అధికారులు చొరవ చూపాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నిధులను విద్యార్థులకు అందించారా అని ఎం.పీ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే విద్యార్థుల బ్యాంకు ఖాతాలలో నేరుగా ఉపకార వేతనాలను జమ చేయించామని సంక్షేమ శాఖల అధికారులు ఎం.పీ దృష్టికి తెచ్చారు. కాగా, డిసెంబర్ నెలలో నిర్వహించనున్న ఖేలో ఇండియా జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలకు జిల్లా యంత్రాంగం చొరవతో ప్రభుత్వం నిజామాబాద్ జిల్లాను వేదికగా ఎంపిక చేయడం పట్ల ఎం.పీ అర్వింద్ హర్షం వెలిబుచ్చారు. క్రీడా పోటీల విజయవంతానికి, జిల్లాలో క్రీడా సదుపాయాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి పూర్తి స్థాయిలో సహకారం అందేలా కృషి చేస్తానని అన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలో ఎల్ నినో ప్రభావం గురించి వివరిస్తూ, అధికార యంత్రాంగం తరపున చేపడుతున్న ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికను వెల్లడించారు. అదృష్టవశాత్తు ఖరీఫ్ సీజన్ లో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో జిల్లా రైతాంగం గట్టెక్కగలిగారని అన్నారు. అయితే ప్రస్తుతం యాసంగిలో మాత్రం పంటలకు సాగునీరు అందించే పరిస్థితి లేదని, ఈ మేరకు ప్రభుత్వం కూడా స్పష్టమైన నిర్ణయం తీసుకుందని తెలిపారు. వర్షాభావం, ఇతర పరిస్థితులను పరిగణలోకి తీసుకుని జిల్లాలోని 18 మండలాలలో సాధారణ కరువు నెలకొని ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రబీలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా జొన్న, పప్పు దినుసులు వంటి ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతు వేదికల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రైతులకు రాయితీపై ఆరుతడి పంటల విత్తనాలు అందిస్తున్నామని, రాష్ట్రంలోనే అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో వీటిని పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల వచ్చే జూన్, జూలై మాసాల వరకు కూడా వర్షాలు కురిసే పరిస్థితి లేనందున ప్రస్తుతం జలాశయాల్లో నిలువ ఉన్న నీటి వనరులను పూర్తిగా తాగునీటి అవసరాలకే వినియోగించేలా ప్రణాళికలు రూపొందించామని కలెక్టర్ స్పష్టం చేశారు. గత ఏడాది శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ఇదే సమయానికి 80 టీ.ఎం.సీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 35 టీ.ఎం.సీలకే పరిమితం అయ్యిందన్నారు. అదేవిధంగా నిజాంసాగర్ రిజర్వాయర్ లోనూ గతేడాది 17 టీఎంసీల నీరు నిలువ ఉండగా, ప్రస్తుతం 9 టీ.ఎం.సీలు మాత్రమే ఉందన్నారు. ప్రతీకూల పరిస్థితుల కారణంగా భూగర్భ జలమట్టం సైతం వేగంగా పడిపోతోందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు రబీలో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డీ.ఆర్.ఓ గీత, డీఆర్డీఓ సాయన్న, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, వివిధ శాఖల అధికారులు, దిశా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984